క్లుప్తంగా

విద్యార్థులు ప్రణాళికతో చదవాలి



మాట్లాడుతున్న ఎక్సైజ్ ఎస్ఐ వినోద్‌కుమార్

హుజూరాబాద్: విద్యార్థులు ప్రణాళికతో చదివితే మంచి భవిష్యత్ ఉంటుందని హుజూరాబాద్ ఎక్సైజ్ ఎస్ఐ వినోద్‌కుమార్ అన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పేరెంట్స్ మీట్ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. విద్యార్థులకు ప్రభుత్వం అన్ని రకాలను సదుపాయాలను కల్పిస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యాపరమైన అంశాలు, వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. తల్లిదండ్రులు విద్యార్థుల ప్రవర్తనను గమనిస్తూ ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆంజనేయరావు, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఉన్నారు.

రైతుల అభివృద్ధికి రాయితీలు



మాట్లాడుతున్న ఐసీఎం డీడీ శ్యాంకుమార్

చొప్పదండి: రైతుల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీలు ప్రకటిస్తున్నాయని ఇనిస్టిట్యూట్ ఆఫ్ కోఆపరేటీవ్ మేనేజ్‌మెంట్, మినిస్ట్రీ ఆఫ్ కోఆపరేటివ్‌శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శ్యాంకుమార్ అన్నారు. మండలంలోని ఆర్నకొండ పీఏసీఎస్‌లో గురువారం రైతులకు రాయితీలపై నిర్వహించిన అవగాహన సమావేశంలో మాట్లాడారు. సబ్సిడీ విత్తనాలు, రాయితీ రుణాలు, ఇతర అంశాలను వివరించారు. సహకార సంఘాల ద్వారా అందుతున్న ప్రోత్సాహకాలపై రైతులకు అవగాహన ఉండాలని కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ తిరుపతిరావు, సీఈవో కుమారస్వామి, రైతులు రవీదర్, లచ్చయ్య, సుధాకర్ పాల్గొన్నారు.

వసతిగృహాల సందర్శన



తనిఖీ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

గంగాధర: మండలంలోని బీసీ బాలికల, బాలుర వసతిగృహాలతో పాటు మోడల్‌స్కూల్, కేజీబీవీలను గురువారం బీఆర్ఎస్వీ నాయకులు సందర్శించారు. మౌలిక వసతులు, భోజనం, వంట సామగ్రి తదితరవాటిని పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందడంలేదని బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ ద్యావ మధుసూదన్‌రెడ్డి విమర్శించారు. నాణ్యమైన భోజనం, మెరుగైన విద్యను అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బందారపు అజయ్‌గౌడ్, సుంకె అనిల్, జలంధర్‌రెడ్డి సముద్రాల ఓంకార్, మామిడిపల్లి అఖిల్, వెంకటేశ్ పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గంగాధర: ఆరుగ్యారంటీల హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని బీజేపీ చొప్పదండి కన్వీనర్ పెరుక శ్రావణ్‌కుమార్ విమర్శించారు. ఆరు గ్యారంటీలను అమలు చేయాలని, రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కోల అశోక్, మల్యాల వినయసాగర్, ఎడవెల్లి శశిధర్‌రెడ్డి, గుండారపు సంపత్‌కుమార్, బొమ్మకంటి రాజిరెడ్డి, పంజాల ప్రశాంత్ రెడ్డి, శ్రీనివాస్, సుద్దాల రవీందర్‌రెడ్డి, పెంచాల రాములు, ఆకుల మనోహర్ పాల్గొన్నారు.

వీణవంక: మోసపూరిత హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని బీజేపీ మండల అధ్యక్షుడు రామిడి ఆదిరెడ్డి ఆరోపించారు. మండల కేంద్రంలో మాట్లాడారు. ఆరు గ్యారంటీల పేరుతో గారడీ చేస్తుందని, ఏ ఒక్క హామీ పూర్తి స్థాయిలో అమలు చేయడంలేదని ఆరోపించారు. నాయకులు పుప్పాల రఘు, నరసింహారాజు, బత్తిని నరేశ్, ఎనంగటి శ్రీనివాస్, పూదరి అనిల్, పర్లపల్లి స్వామి ఉన్నారు.

నేడు పశువైద్య శిబిరం

మానకొండూర్‌రూరల్: మండలంలోని లక్ష్మీపూర్, అన్నారం దేవంపల్లి గ్రామాల్లో శుక్రవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించనున్నామని డాక్టర్ అరవింద్ ప్రకటనలో తెలిపారు. కోరుట్ల పశువైద్యశాల సిబ్బంది పాల్గొంటారని పాడి రైతులు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

యాసంగి సాగు చేసేదెలా..!

- నారు మడులకు సిద్ధమవుతున్న రైతులు
- పంటలపై అవగాహన సదస్సులు నిర్వహించని వ్యవసాయశాఖ అధికారులు
- సలహాలు, సూచనలు కోసం అన్నదాత నిరీక్షణ
- తోచిన వంగడాల సాగుకే మొగ్గుచూపుతున్న వైనం



కొండాపూర్‌లో నారుమడి సిద్ధం చేసిన రైతు

చిగురుమామిడి: మండలంలోని ఆయా గ్రామాల్లో యాసంగి సాగు ప్రారంభమైనప్పటికీ వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వడంలేదు. మండలంలో 17 గ్రామ పంచాయతీలు, ఆరు రెవెన్యూ గ్రామాలున్నాయి. ప్రతి రెవెన్యూ గ్రామానికో ఏఈవో, వీరిపై ఏవో (మండల వ్యవసాయశాఖాధికారి) ఉన్నారు. వీరు రైతువేదికల్లో అందుబాటులో ఉంటున్నప్పటికీ క్షేత్రస్థాయిలోకి కొందరు ఏఈవోలు వెళ్లడంలేదనే ఆరోపణలున్నాయి. రైతు వేదికకు వచ్చామా రెండు , మూడు గంటలు ఉన్నామా తిరిగి వెళ్తున్నామా అనే చందంగా విధులు నిర్వహిస్తున్నారని ఆరోపణలు. పూర్తిస్థాయిలో ఉండాల్సిన వ్యవసాయాధికారి సెలవుపై వెళ్లగా ఇన్‌చార్జి ఏవో ఉండకపోవడంతో రైతులు సమస్య ఎవరికి చెప్పాలో తెలియక సతమతమవుతున్నారు. పూర్తిస్థాయి ఏవో వచ్చినప్పటికీ రుణమాఫీ కాని రైతులకు సరైన సమాధానాలు చెప్పేవారులేక అవస్థలు పడుతున్నారు.

దృష్టి సారించని వ్యవసాయశాఖ అధికారులు

నారుమడులకు అనువైన సమయం కావడంతో ఏ వంగడాలు సాగుచేయాలి, ప్రభుత్వం ఏం చెబుతోంది, సన్నాలకు దిగుబడి వస్తుందా లేదా అనే అంశాలపై వ్యవసాయశాఖ అధికారులు సలహాలు, సూచనలు చేయడంలేదు. ఇప్పటికే గ్రామాల్లో రబీ సాగుపై అవగాహన సమావేశాలు నిర్వహించి రైతుల సందేహాలకు సమాధానాలు ఇవ్వాల్సి ఉంది. కానీ అధికారులు ఇప్పటి వరకు సమావేశాలు నిర్వహించకపోవడంతో తోచిన వంగడాల సాగుకు మొగ్గుచూపుతున్నారు. యాసంగికి ముందే రైతు సదస్సులు నిర్వహించాలి కానీ వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు ఈ విషయంపై ఎందుకు దృష్టిసారించడంలేదో అర్థంకావడంలేదని పలువురు రైతులు అభిప్రాయపడుతున్నారు.

రైతులు సతమతం

రైతులు మొక్కజొన్న, వేరుశనగ సాగుచేశారు. నెల రోజులు కావస్తుంటే మొక్కజొన్నలో మొగి పురుగు ఉధృతి ఎక్కువైందని ఆకుముడత, ఇతర రోగాలతో ఏం చేయాలో తెలియక రైతులు సతమతమవుతున్నారు. వారానికోసారి క్రిమిసంహారక మందులు పిచికారీ చేస్తున్నారు. అయినా ఉధృతి తగ్గడంలేదని రైతులు వాపోతున్నారు. వ్యవసాయశాఖాధికారులు పంటలను పరిశీలించడంలేదనని రైతుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అవగాహన ఉన్న రైతులు అధికారులకు ఫోన్ చేసి సమస్య చెబితే ఏ మందులు పిచికారీ చేయాలో చెబుతున్నారు. తెలియని రైతులు నష్టపోవడమే. ఇప్పటికైనా సంబంధిత అధికారులు గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించి రైతులను చైతన్యం చేయాలని, లేదంటే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని పలువురు పేర్కొంటున్నారు.

> **సదస్సులు నిర్వహిస్తాం**
>
> గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ పూర్తికావస్తోంది. ప్రతి మంగళవారం రైతువేదికల్లో హైదరాబాద్ నుంచి వ్యవసాయశాస్త్రవేత్తలు పంటల సాగుపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నారు. కొనుగోళ్లు పూర్తి కాగానే రైతు వేదికల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తాం.
>
> – రాజులునాయుడు, ఏవో

వరల్డ్ సాయిల్ డే



రామడుగు: అవగాహన కల్పిస్తున్న సంస్థ ప్రతినిధులు



గంగాధర: మట్టి సేకరణను వివరిస్తున్న ఆఫీసర్లు

మానకొండూర్‌రూరల్: ప్రపంచ మృత్తికా దినోత్సవం సందర్భంగా మండలంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఇషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మట్టి సంరక్షణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సేవ్ సాయిల్ స్టిక్కర్లు విద్యార్థులకు పంపిణీ చేశారు. మట్టి ప్రాముఖ్యత, రక్షణ, ప్రకృతిని రక్షించుకోవడం విద్యార్థులకు వివరించారు.

గన్నేరువరం: వర్మీ కంపోస్టు ద్వారా భూమి పునర్జీవం పొంది మళ్లీ మంచి సారవంతంగా మారుతోందని దేశ్‌పాండే ఫౌండేషన్ సభ్యులు తెలిపారు. పారువెల్ల గ్రామంలో వర్మీ కంపోస్టు తయారీ, వాడకంపై రైతులకు అవగహన కల్పించారు.

గంగాధర: పంట సాగులో సేంద్రియ ఎరువులు వినియోగించి పెట్టుబడి తగ్గించుకోవడం, దిగుబడి పెంచుకోవాలని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ అన్నారు. కురిక్యాల, గర్శకుర్తి, గంగాధర, మల్లాపూర్, బూర్గుపల్లి క్లస్టర్ పరిధిలోని రైతులకు నేల ఆరోగ్య పరిరక్షణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మట్టి నమూనా సేకరించే విధానంపై వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పించారు.

రామడుగు: దేశరాజ్‌పల్లి గ్రామ పరిధి వెదిర్‌పల్లిలో బీసీఐ, నవక్రాంతి ఫార్మర్ ప్రొడ్యూసర్ సంస్థ ఆధ్వర్యంలో భూసారంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

చిగురుమామిడి: భూమిని సంరక్షించడం వల్ల పంటల దిగుబడి పెరుగుతుందని మండల వ్యవసాయ అధికారి రాజులూనాయుడు తెలిపారు. మండలంలోని చిన్నముల్కనూర్‌లో రైతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వరి కొయ్యలు కాల్చడం వల్ల పంటలకు మేలు చేసే కీటకాలు నశిస్తాయన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

హుజూరాబాద్: పబ్లిక్, ప్రైవేటు రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో 7న నిర్వహించే ఆటో, క్యాబ్‌ల బంద్‌ను జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పున్నం రవి, చెలికాని శ్రీనివాస్ కోరారు. గురువారం బంద్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా ఆటో డ్రైవర్లకు ఎలాంటి ప్రకటన చేయలేదని, రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, పెట్రోల్, డీజిల్, గ్యాస్, ధరలు తగ్గించి జీఎస్టీలోకి తీసుకోవాలని, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 2019 మోటార్ యాక్ట్ చట్టాన్ని రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ కదిరే రమేశ్, తోట కిషన్, పెండ్యాల కిరణ్, ముప్పు అరుణ్, మచ్చ అరుణ్ కుమార్, శనిగరం కుమార్, భిక్షపతి, సాంబయ్య, పవన్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి అరెస్టు హేయమైన చర్య





హుజూరాబాద్: మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక, తిమ్మాపూర్‌లో నాయకుల నిరసన

హుజూరాబాద్: ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అరెస్టు హేయమైన చర్య అని మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక-శ్రీనివాస్ అన్నారు. గురువారం పట్టణంలో మాట్లాడారు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వెళ్తే.. పోలీసులకు విధులకు ఆటంకం కలిగించారంటూ ఎమ్మెల్యేను అరెస్టు చేయడం అప్రజాస్వామికమని అన్నారు. ఎమ్మెల్యేపై అక్రమ కేసులను ఎత్తి వేయాలని డిమాండ్ చేశారు.

వీణవంక: ప్రభుత్వం ప్రజాప్రతినిధులను అణిచివేయాలనుకోవడం సరికాదని టీహెచ్ఆర్ వ్యవస్థాపక అధ్యక్షుడు అప్పని హరీశ్ వర్మ అన్నారు. రామకృష్ణాపూర్ మాట్లాడారు. ప్రజాసమస్యలపై ప్రశ్నిస్తే అరెస్టులు చేయడం దారుణమని ఆరోపించారు.

ఇల్లందకుంట: ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, కౌశిక్‌రెడ్డిల అరెస్టును నిరసిస్తూ మండలకేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రాస్తారోకో చేశారు.

జమ్మికుంట: అక్రమ అరెస్టును ఖండిస్తున్నామని మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ సంపత్ అన్నారు. ప్రజల పక్షాన పోరాటం చేస్తుంటే సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాస్వామ్యం గొంతు నొక్కుతున్నారని ఆరోపించారు.

తిమ్మాపూర్: ఎమ్మెల్యేల అరెస్టుకు నిరసనగా బీఆర్ఎస్ మండలశాఖ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. రాజీవ్‌రహదారిపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు.


పేదలకు ఆర్థిక భరోసా



నగదు అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

గంగాధర: పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే కార్యక్రమంలో భాగంగా గామ ఫౌండేషన్ చారిటబుల్ ట్రస్టు ద్వారా గురువారం కురిక్యాల గ్రామంలో పది కుటుంబాలకు రూ.వెయ్యి చొప్పున ప్రాజెక్టు డైరెక్టర్ జోగు పోలు(నర్సయ్య), కార్యదర్శి పొత్తూరి సురేశ్ అందజేశారు. తెల్లరేషన్‌కార్డు, ఫౌండేషన్‌లో సభ్యత్వం ఉన్నవారు నగదు పొందడానికి అర్హులని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంసీవోలు గజ్జెల సతీశ్, రాకేశ్, సురేశ్, గీత పాల్గొన్నారు.

ప్రజల పక్షాన పోరాడుతాం



సమావేశంలో మాట్లాడుతున్న రవిశంకర్

గంగాధర: పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వెళ్లిన వారిపై కేసులు బనాయించి అరెస్టు చేయడం సరికాదని, రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం నడుస్తుందా..ఎమర్జెన్సీ పాలన నడుస్తుందా అని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ విమర్శించారు. మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అరెస్టును నిరసిస్తూ స్థానిక నాయకులతో కలిసి మాట్లాడారు. ప్రజాస్వామ్యపాలనలో అడిగితే అరెస్టు, ప్రశ్నిస్తే కేసులు, నిలదీస్తే బెదిరింపులకు పాల్పడుతున్నారని, ఎన్ని తప్పుడు కేసులు బనాయించినా బయపడమని, ప్రజల పక్షాన పోరాడుతూనే ఉంటామని పేర్కొన్నారు.

సన్మానం

గన్నేరువరం: యువజన కాంగ్రెస్ ఎన్నికల్లో గెలుపొందిన మండల అధ్యక్షుడు రాపోలు నవీన్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా దేశరాజ్ అనిల్, మానకొండూర్ నియోజకవర్గ కార్యదర్శిగా దేశరాజ్ నవీన్‌ను ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ గురువారం క్యాంపు కార్యాలయంలో సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు చింతల శ్రీధర్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మాతంగి అనిల్, ఏలేటి సతీష్‌రెడ్డి, మాంకాలి మల్లికార్జున్, వేదిరే విజయేందర్, కండె ప్రశాంత, న్యాత నవీన్, రాపోలు హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

రామడుగు: యువజన కాంగ్రెస్ రామడుగు అధ్యక్షుడిగా ఎన్నికైన మండల కేంద్రానికి చెందిన అనుపురం పర్శరాంగౌడ్‌ను గురువారం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్‌పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కష్టపడ్డ కార్యకర్తకు గుర్తింపు

హుజూరాబాద్: కాంగ్రెస్ బలోపేతానికి కష్టపడ్డ ప్రతికార్యకర్తకు గుర్తింపు లభిస్తుందని హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ అన్నారు. గురువారం మండలంలోని సింగాపూర్ స్వగృహంలో యూత్ కాంగ్రెస్ హుజూరాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడిగా ఎన్నికైన చల్లూరి రాహుల్‌ను శాలువాతో సత్కారించారు. ప్రణవ్ మాట్లాడుతూ రాహుల్ నాయకత్వంపై నమ్మకంతో కార్యకర్తలు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ ఎస్సీ డిపార్ట్‌మెంట్, అట్రాసిటీ రాష్ట్ర ఇన్‌చార్జి తిప్పారపు సంపత్, మాజీ మండలాధ్యక్షుడు కొలువూరి కిరణ్ తదితరులు ఉన్నారు.

శంకరపట్నం: యూత్ కాంగ్రెస్ శంకరపట్నం అధ్యక్షుడిగా ఆడెపు అజయ్, ఉపాధ్యక్షులుగా పూరెళ్ల ప్రశాత్, ఆంజనేయులు, కార్యదర్శిగా గండికోట రవి, మానకొండూర్ నియోజవర్గ యూత్ ఉపాధ్యక్షుడిగా ఎండీ షారుఖ్ ఎన్నికయ్యారు. ఎన్నికైన వారిని గురువారం మండలంలోని పార్టీ కార్యాలయంలో మాజీ జెడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్‌గౌడ్ సన్మానించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బస్వయ్య, మార్కెట్ వైస్ చైర్మన్ తిరుపతి, చంద్రమౌళి, సదానందం, రాజయ్య, వీరయ్య, ఇసామొద్దీన్, తదితరులు ఉన్నారు.

మార్కెట్ కమిటీ డైరెక్టర్లకు...

చిగురుమామిడి: మండల పరిషత్ కార్యాలయంలో హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ చిగురుమామిడి అధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డిని అధికారులు సన్మానించారు. తిరుపతిరెడ్డి గురువారం మొదటిసారి కార్యాలయానికి వచ్చిన సందర్భంగా సన్మానం చేసి స్వీట్లు పంపిణీ చేశారు. తహసీల్దార్ రమేశ్, ఎంపీడీవో మధుసూదన్, పావని, రాజేశ్ సిబ్బంది పాల్గొన్నారు.

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పోడేటి శంకర్‌గౌడ్, తౌరికొండ నారాయణను గురువారం వెదిరలో కాంగ్రెస్ పార్టీ టీపీసీసీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర వైస్ చైర్మన్ వెన్న రాజమల్లయ్య ఆధ్వర్యంలో నాయకులు సన్మానించారు. వెదిర నుంచి ఇద్దరికి మార్కెట్ కమిటీ డైరెక్టర్లుగా అవకాశం కల్పించిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు ధన్యావాదాలు తెలియజేశారు. నాయకులు మోహన్, శేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.

బహుమతులు ప్రదానం



దివ్యాంగులకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఎంఈవో శ్రీనివాస్

హుజూరాబాద్: పట్టణంలోని ఎమ్మార్సీ కార్యాలయ ఆవరణలోని భవిత కేంద్రంలో గురువారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. దివ్యాంగులకు వివిధ పోటీలు నిర్వహించి ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఎంఈవో భూపతి శ్రీనివాస్ బహుమతులను ప్రదానం చేశారు.హెచ్‌ఎంలు మేరీ శోభారాణి, సమ్మిరెడ్డి, సంపత్ కుమార్,శనిగరపు మేఘన, టీచర్లు ఉన్నారు.



చొప్పదండి: పట్టణంలోని పాత వాటర్ ట్యాంకు చుట్టూ టేకుచెట్లు ఏపుగా పేరుకుపోయాయి. ట్యాంకు ఉపరితలంపై సిమెంట్ నిర్మాణాలు ప్రమాదకరంగా మారాయి. ట్యాంకుకు మరమ్మతు చేసి ప్రమాదకరంగా ఉన్న టేకు చెట్లు తొలగించాలి. - జిట్ట కుమార్, చొప్పదండి

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారులు
నాగరాజు, మున్సిపల్ కమిషనర్, చొప్పదండి, సెల్ నం. 9949267882

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

క్రీడా వార్తలు

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

చొప్పదండి: ఆల్ ఇండియా పోలీస్ మీట్‌లో భాగంగా రాజస్థాన్‌లో జరిగే జాతీయ స్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొనేందుకు చొప్పదండి పట్టణానికి చెందిన హెడ్ కానిస్టేబుల్ యామ మల్లేశం ఎంపికయ్యాడు. సిరిసిల్ల పోలీస్ హెడ్‌క్వార్టర్‌లో పనిచేస్తున్న మల్లేశం వాలీబాల్‌లో ప్రతిభ కనబరిచి ఆల్ ఇండియా మీట్‌కు ఎంపికయ్యాడు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల స్థానికులు అభినందించారు.

జిల్లా స్థాయి పోటీలకు...

రామడుగు: మండలంలోని వెలిచాల సరస్వతి పాఠశాల విద్యార్థిని ఎల్లమ్మల ప్రసన్న సీనియర్ విద్యార్థుల విభాగంలో అవినీతి నిర్మూలన–పౌరుల పాత్ర అనే అంశంపై రామడుగులో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైందని స్కూల్ కరస్పాండెంట్ ఉప్పుల శ్రీనివాస్ తెలిపారు. ప్రసన్నను శ్రీనివాస్, కోకరస్పాండెంట్ ఉప్పుల సత్యం, టీచర్లు అభినందించారు. గోనె వైష్ణవి పదో తరగతి రుద్రారం జెడ్పీహెచ్ఎస్, రాగం స్రవంతి ఎనిమిదో తరగతి రామడుగు మోడల్ స్కూల్, ఎం. కీర్తన తొమ్మిదో తరగతి గుండి జెడ్పీహెచ్ఎస్ విజేతలుగా నిలవగా ఎంఈవో అంబటి వేణుకుమార్ అభినందించారు.

హాకీ పోటీల్లో విద్యార్థి ప్రతిభ

హుజూరాబాద్: పట్టణంలోని అల్ఫోర్స్ పాఠశాలకు చెందిన విద్యార్థిని చిరుత పరిణీత ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి హాకీ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయికి ఎంపికైంది. అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి పరిణీతను అభినందించారు. 8వ తేదీ నుంచి మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయ పోటీల్లో పాల్గొననుంది.

కరాటే సర్టిఫికెట్ల ప్రదానం



చొప్పదండి: సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులు

చొప్పదండి: జపాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని లిటిల్స్ ఐలాండ్ స్కూల్‌లో విద్యార్థులకు కరాటే సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో కరాటే బెల్ట్, సర్టిఫికెట్లను రాష్ట్ర ప్రధాన శిక్షకులు రాపోలు సుదర్శన్, తెలంగాణ పోలీస్ అసోసియేషన్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ ఇన్‌స్పెక్టర్ కె. శ్రీనివాసాచారి, రాష్ట్ర అసోసియేట్ ట్రెజరర్ సీ. నాగరాజు అందజేశారు. జనవరి 18 నుంచి 22 వరకు హైదరాబాద్ గచ్చిబౌలిలో నిర్వహించే ఇంటర్నేషనల్ ఈవెంట్‌కు ఎం.నీరజ, బి. శ్రీహిత, పి. హర్షవర్ధన్, అరవింద్ ఎంపికైనట్లు ప్రకటించారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్ రాజు, కరస్పాండెంట్ రవికుమార్, ట్రస్మా మండల అధ్యక్షులు ఆనందరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సంఘాలు - నియామకాలు

జమ్మికుంట: మండలంలోని మాచనపల్లి గ్రామానికి చెందిన పర్లపల్లి నాగరాజు ఇటీవల నిర్వహించిన యువజన కాంగ్రెస్ ఎన్నికల్లో జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైనట్లు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడారు. యువజన ఎన్నికల్లో నమ్మకంతో ఓట్లు వేసి గెలిపించిన ప్రతి ఒక్కరి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

హుజూరాబాద్: కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా హుజూరాబాద్ పట్టణానికి చెందిన సొల్లు వై. థామస్ ఎన్నికయ్యారు. పార్టీలో చురుకైన కార్యకర్తగా జీవితాన్ని ప్రారంభించిన థామస్ కాంగ్రెస్ బలోపేతానికి కోసం కృషి చేశారు. పలువురు నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

గన్నేరువరం: మండలంలోని మైలారం గ్రామానికి చెందిన గుర్రం వాసు యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడిగా గెలుపొందాడు. ఈసందర్భంగా గురువారం గ్రామంలో మాట్లాడారు. ప్రజాస్వామ్య బద్ధంగా జరిగిన ఎన్నికల్లో యువత నమ్మకంతో ఓటువేసి గెలిపించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధి, యువత సంక్షేమానికి కృషి చేస్తానని తెలిపారు.

చిగురుమామిడి: యువజన కాంగ్రెస్ చిగురుమామిడి అధ్యక్షుడిగా బోయిని వేణుగోపాల్ ఎన్నికయ్యారు. హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతిరెడ్డి శాలువా కప్పి అభినందించారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ కూతుబుద్దీన్, నాయకులు సంతోష్, రమేష్, రఘుబాబు, సంజీవ్ పాల్గొన్నారు.



రామడుగు కురుమ యువసేన కార్యవర్గం

రామడుగు: రామడుగు కురుమ యువసేన నూతన కార్యవర్గాన్ని సంఘం సభ్యులు గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మొగిలి ప్రభాకర్, ఉపాధ్యక్షుడిగా కడారి నరేశ్, ప్రధాన కార్యదర్శిగా ముత్త భూమేశ్, కోశాధికారిగా కడారి శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులుగా కడారి రాజు, ఈరల్ల కుమార్, కడారి హరీశ్, బూమల్ల శేఖర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

హుజూరాబాద్: పట్టణానికి చెందిన రాం సారయ్యను మాదిగ ఐక్య సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమిస్తూ మిద్దపాక రవీందర్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. నియామకానికి సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్యే పరామర్శ

చొప్పదండి: మండలంలోని చాకుంటకు చెందిన గాలిపెల్లి బక్కయ్య అనారోగ్యంతో మృతిచెందగా బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పరామర్శించారు. పట్టణంలోని పందిళ్ల రాజయ్య మృతి చెందగా ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.ఐదువేలు అందించారు. పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ కొత్తూరి మహేశ్, పట్టణ అధ్యక్షుడు నిజానపురం చందు, పెరుమాండ్ల గంగయ్యగౌడ్, పురం రాజేశం , బొడిగె శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

గన్నేరువరం: మండలంలోని ఖాసీంపేట గ్రామానికి చెందిన దానవేని రిత్విక్(20) చికిత్స పొందుతూ మృతి చెందాడు. కొద్ది రోజులు క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. గురువారం ఆరోగ్యం క్షీణించి మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. యువకుడి మృతితో గ్రామంలో విషాదం నెలకొంది. తల్లిదండ్రులు కుమారుడి వైద్య కోసం లక్షల ఖర్చు చేసినా ఫలితం లేకుండా పోయిందని పలువురు కంటతడి పెట్టారు.

కేసు నమోదు

జమ్మికుంట: అజాగ్రత్తగా ఆటోట్రాలీ నడపడంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. దీంతో డ్రైవర్‌పై గురువారం కేసు నమోదు చేశామని టౌన్ సీఐ వరంగంటి రవి తెలిపారు. పట్టణంలోని ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై నవంబర్ 26న ఆటోట్రాలీ, బైక్ ఢీకొన్న ఘటనలో పట్టణంలోని మోత్కులగూడెం గ్రామానికి చెందిన మొలుగూరి రాజేశ్, భార్య స్రవంతి గాయాలపాలయ్యారు. బాధితుడి తల్లి పూలమ్మ ఫిర్యాదుతో ఆటోట్రాలీ డ్రైవర్ ఓదెల మండలం గుంపుల గ్రామానికి చెందిన సమ్మయ్యపై కేసు నమోదు చేశామన్నారు.